

# సన్మానం

ఇచ్ఛాపురపు రామచంద్రం

"శ్రీరా అప్పుడే సామాను కూడా సర్దేశారే!" లోపలకు రాబోతూ ద్వారం వద్ద ఆగిపోయారు బ్రహ్మానందంగారు

"రండి. మధ్యాహ్నం వెళ్ళిపోవాలనుకుంటున్నాను. ఒక్క మనిషికి ఉండే సామాను ఏపాటి?" అంటూ కుర్చీ వేశా నాయనకి

"మీరింకా రేపో ఎల్లుండో వెళతారనుకున్నాను" మెల్లగా అన్నారాయన కంఠంలో నిరాశను ధ్వనింపజేస్తూ.

"కోరుకున్న బదిలీకాక ఆట్టే వ్యవధి యివ్వరధికారులు. మీకు తెలియని దేముంది?"

"మీ రివాళ వెళ్ళిపోకండి. కనీసం రాత్రివరకయినా ఉండండి ప్లీజ్..."

"ఎందుకూ? ఈ వూళ్ళో నాకు కావలసిన వారు మీరొక్కరే. నిన్న రాత్రి మీ యింట్లో డిన్నర్ తినిపించేశారు. ఇక ఎవరికోసం ఆగాలి?"

"నామాట కాదనకండి. దయచేసి సాయంత్రం దాకా యిక్కడుండండి." ప్రాధేయ పడుతున్నట్టు చూశా రాయన నావంక.

అంత పెద్దమనిషి అలాటి కోర్కె కోరవాడినలా ప్రతిమాలడం నాకు భరించ శక్యంకాక - 'అసలు విషయమేమిటో చెప్పండి' అని అడిగాను.

'ఇవాళ...సాయంత్రం .. మిమ్మల్ని సన్మానించ దల్చుకున్నాం" దావు కబురు చల్లగా చెప్పేశారాయన. కోవెలలో సన్మానసభ ఏర్పాటైంది. నేనే అధ్యక్షుణ్ణి. చాలా కష్టపడి నలుగురినీ కూడా చేశాను. మీరు నే హితులు. మంచిమనసు కలవారు. మీరు నన్ను కాదనరన్న విశ్వాసంతో అంతా చేశాను. ఈ పల్లెటూరిలో యిన్నాళ్ళు మీ విలువ ఎవరూ గుర్తించలేదని నే నంగీకరిస్తాను. ఇప్పుడందరమూ పశ్చాత్తాప పడుతున్నాం. ఈ సన్మానం మూలంగా అయినా.. "

ఆశ్చర్యంనుంచి తేరుకోలేక అడిగాను. సన్మానమా? వీడ్కోలా?"

'సన్మానసభే' ఖచ్చితంగా చెప్పారాయన.

'నాకెందుకు సన్మానం?"

'మీరు కాదన్నా మీ గొప్పతనం తగ్గిపోయేదేమీ లేదు ఎన్నో పత్రికలలో మీ రచన లచ్చుపడ్డాయ్ మీరు కవులు. పండితులు..."

"ఆగండి, గణాలు తెలియని నేను కవినేమిటి? నాకున్న పాండిత్యం శూన్యం. అనర్హుడిని పట్టుకుని, ఆకాశానికెత్తెయ్యడం ధర్మంకాదు."

"మీరు కథలు రాశారా, లేదా? అందులో ఏ గొప్పతనమూ, ప్రత్యేకతా లేకుండానే పత్రికలు అచ్చువేశాయంటారా? మీరు సంఘానికెంత సేవ చేశారో, సాహిత్యాభివృద్ధికెంత కృషి చేశారో.."

"క్షమించాలి. కాలక్షేపం కోసం వ్రాయడం మినహా సంఘాన్నుద్ధరించెయ్యాలని కానీ ఉద్ధరించగలననికానీ నాకు ఆశలులేవు. కథలతో మనుషులు మారిపోయేటట్లయితే రామాయణం ఉన్నంతకాలం మనది రామరాజ్యంగానే ఉండాలి.

మీరేమీ అనుకోరు కనుక నిజం చెప్పేస్తాను. సాహిత్యం అన్న పదానికి సమగ్రమైన అర్థమే తెలియని నేను సాహిత్య సేవ చేయడమేమిటి? ఇక్కడ ఏమీ తోచక కథలు వ్రాసినమాట నిజం. అదృష్టాన్నిబట్టి అవి అచ్చుపడి ఉంటాయ్ అందుచేత..."

నామాటకు అడ్డువచ్చేశారు బ్రహ్మానందంగారు. 'కథలు వ్రాయడం మీ రన్నంత తేలిక అయితే నావి ఎందుకు పడలేదు?"

"మీ వయస్సు ఏభై దాటింది. పాఠకులలో అధిక సంఖ్యాకులు యువకులు. వాళ్ళని ఊరించే ఆలోచనలు సాగించడం యీ వయసులో మీకంత సులభ మనుకోను. అదీకాక మీరు వేదాంతమూ వైరాగ్యమూ వీటిలో తేలియాడుతుంటారు. అయినా మీరు కుర్రకథలు వ్రాయడమేమిటి చెప్పరూ..." మెల్లగా సంభాషణని ప్రక్కదారులు పట్టించి ఆయనబారినుంచీ సన్మానప్రమాదంనుంచీ తప్పించుకుందామని ప్రయత్నించాను. కాని...

సభ ఏర్పాట్లుకోసం ఆయనపడిన శ్రమ అంతా యాకరువు పెట్టారు. ఏడాది స్నేహానికి ప్రతిఫలంగా అయినా నా అంగీకారా న్నిమ్మన్నారు. నేను కాదంటే వాళ్ళందరి ముఖాలలోనూ మనసులలోనూ ఆవరించుకునే నిరాశను భూతద్దాలలోంచి చూపించేరు నాకు.

అంతకీ చివరిమాటగా అన్నాను నేను 'ఈ సన్మానాలకీ వాటికీ తట్టుకోగలిగేంత శక్తివంతుణ్ని కాను. నాకు గర్వం పెరిగిపోవచ్చు. అప్పుడు నిజంగా నేను కథలు రాయడం మానేయవలసి రావచ్చు ఈ సన్మానం నా భవిష్యత్తుకి..."

బ్రహ్మానందంగారు... 'మీరు కాదంటే యిక ఈ వూళ్ళో నేను తలెత్తుక తిరగగలగడం కల్ల. అందరికీ చెప్పేశాను మిమ్మల్ని తీసుకువస్తానని" అంటూ తనది చివరిమాట చేసేశారు.

మూర్ఖత్వం - మొండితనం - రెండింటిలోనూ బంధవదాన్ని వదిలిపెట్టక తప్పిందికాదు పలితంగా...

సాయంత్రం ఆరుగంటలకు కోవెలలో-సభలో-యిష్టవ్యక్తికిని కావలసి వచ్చింది. కనీసం సభా నివేశమైనా మార్చితే బాగుండుననిపించింది. దేముడున్నాడా లేదా అనేది వేరేప్రశ్న. ఈ మీమాంసలో పడి మనిషిని మరిచిపోయి దేముడికోసం పాకులాడుతూ అన్యాయం చేసుకుంటున్నారు మనుషులని నా ఉద్దేశం. దేముడి ఉనికి కేవలం మనిషి నమ్మ

కంపై ఆధారపడింది. నమ్మితే ఏ నిదర్శనమూ అవసరంలేదు. నమ్మలేని మనిషికి ఏ నిదర్శనమూ చాలదని ఆంగ్లోక్తి. మనిషి గురించికాక దేముడి గురించి ఆలోచించడం వీలైనంత తగ్గిస్తే మంచి దనే నావ్యక్తిగతాభిప్రాయానికి పూర్తిగా విరుద్ధంగా సన్మాన సభ కోవెలలో ఏర్పాటయింది

ఒక్కసారి సభికులవంక చూశాను ధైర్యం తెచ్చుకుని.

ఎంపె ఉత్తరీయాలవారు లేతప్ప బైట్ ప్యాంట్లెక్కడా కనపడలేదు. ఎక్కడా కనపడలేదన్నానని అదేదో పెద్ద సభిక సమూహమని నా ఉద్దేశంకాదు వచ్చినవారందరూ పెద్ద మనుషులు. ఏ వొకరి వయస్సైనా నా వయసుకి కనీసం రెట్టింపుకి ఏ మాత్రమూ తక్కువుండదు. జరీ పంచెలూ, పట్టు కండువాలూ — మహా పవిత్రంగా ఉన్నారు కొందరు టాప్‌లెస్. నేను రాసిన కథలలో ఏ ఒక్కదాని గురించి ఏ కొంచం విన్నా వీళ్ళలో ఎవరూ నా ముఖం చూడటానికిష్టపడరు ఆడ ముఖ చిత్రం కనిపిస్తేనే ఆకాశితాలకట నామశదూరంలో ఉంచి ప్రాయశ్చిత్తం చేసుకునే వీళ్లు. కేవలం బట్ట అంచునుబట్టి అడామగా భేదాన్ని గుర్తించే యీ శ్రోత్రీయులు. ఏ తార వొంటి మీదయినా ఎక్కడైనా కొంచం బట్ట పక్కకి తొలిగితే సహజ సౌందర్యాన్ని చూసి తరిద్దామనుకునే నేటి నవీన యువజనానికి ప్రతినిధినైన నన్ను - సన్మానించబోతున్నారు ఒక్క క్షణం నాలో భయంకరమైన ఆలోచన కలిగింది. సన్మానం అనే పదం వెనుక ఐరనీ ఉండటాని కవకాశం ఉందా? ఏమో లోగడ నేనెప్పుడూ సన్మానాల పాలయిన పాపానికి పోలేదు. ఒకరిని సన్మానించిన నేరమూ నే నెరుగను. ఈ సన్మాన ప్రయోగమూ ప్రక్రియా అంతా కొత్తే.

సభ యింకా ప్రారంభం కాలేదు. కనీసం పదిహేను మందయినా ఉండాలి సభకు — అన్న నియమం వంటి దేమైనా ఉండి ఉంటే — సభా ప్రారంభం యీ పల్లెటూళ్ళో ఏ నాటికీ జరగదనే నా అచంచల విశ్వాసం. నన్నూ, అధ్యక్షులవారినీ కలుపుకుంటే పదమూడు. అది దుష్టసంఖ్య కనుక మరొక్కరు వస్తే ప్రారంభిస్తారు కాబోలు. పదిహేనునిముషాలకు ఒకాయన ఆదరాబాదరాగా వచ్చి బ్రహ్మానందంగారి చెవిలో గొణుగుతున్నారు. 'ఎంత ప్రయత్నించినా ఎవరూ రామన్నారు పనులున్నాయట. విష్ణుపాదోదకంతో సభ ముగుస్తుం దని చెప్పినా రాలేదు."

'పరవాలేదులే. నువ్వొచ్చావ్. అంతే చాలు వెళ్ళికూర్చో'

బ్రహ్మానందంగారి పర్సనల్ ఇన్‌ఫ్లుయెన్స్ పన్నెండు!

అధ్యక్షులు బ్రహ్మానందంగారు లేచి - గొంతు సవరించుకుని - దగ్గి - రెండునిముషాలు భంగిమలు (కథాకళిలో) ప్రదర్శించి ఎట్టకేలకు ఇరవై రెండు వాక్యాలు చెప్పారు. అవన్నీ నా గురించే! నా కథల గురించి పొగడ్తలు! ఆయన ధర్మమా అని కథల పేర్లు చెప్పలేదు అవి ఆయనకు గుర్తుండి ఉండవు. ఆయనకి కావలసినవల్లా నేను కథలు రాస్తానా లేదా అనే తప్ప ఏం రాశానని ఎంత మాత్రమూ కాదు.

బ్రహ్మానందంగారు కూర్చోగానే మైకు గోల ఆగి విశ్రాంతి లభించింది. పూలదండ గుచ్చు కుంటూ బాధిస్తూంటే పక్కన పెడదామనుకున్నాను. అది కాగితపుపూలూ. ముచ్చిరేకులూ చెంకీ-కల దండ పొదుపుగా శాశ్వతమైన దండకొనివుంటారు. లోగడ ఎందరి మెడ అలంకరించిందో దుర్భరమైన చెమటకంపు కొడుతూంది. సన్మానబాధకు తోడుగా యీ శారీరకహింస దేనికని తీసివేయబోతుంటే. నా చెయ్యిపట్టుకుని ఆపి. పెళ్ళికొడుకులావున్నారు. తియ్యకండి అనేశారు బ్రహ్మానందం. మైక్ ఉందన్న జ్ఞానం ఆయనలో తాత్కాలికంగా నశించడం మూలాన సభికులకు ఓ జోక్ దొరికి నిముషంపాటు నవ్వుకున్నారు

నిండా పదిహేనుమందిలేని సభకు మైక్ ఎందుకో నా అల్పజ్ఞానానికాక్షణాలలో స్ఫురించ లేదు.

'ఇప్పుడు ఘనాపాఠిగారువచ్చి మాట్లాడుతారు.' అంటూ బ్రహ్మానందంగారు ఎనౌన్స్ చేశారు

"అమ్మా! మీ అబ్బాయి పాంట్లూ స్లాక్స్ వేసుకు తిరుగుతుంటే అతనికి అరటిక్కెట్టేమిటి?" అన్నాడు టిక్కెట్ కలెక్టరు.

"అయితే గుడ్డలు విడిపించేసాను టిక్కెట్టు లేకుండా తీసుకుపోండి' అన్నది తల్లి.

ఇద్దరు ముగ్గురు సాయంచేయగా ఓ పెద్ద బొజ్జాయన నడక అనవసంకంటె దొర్లడం అనడమే నిజం వలకడం అనిపించే తీరులో వేదికవద్దకువచ్చి - మైకు తనవంకే లాక్కుని - ఓ చెయ్యి నా నెత్తి మీదకు జాచి ఓ పావుగంటసేపు గుక్క తిప్పుకోకుండా - పాటో పద్యమో తెలియకుండా - ఏ భాషో అంతుపట్టనివ్వకుండా - నోటికి పనిచెప్పి - చెయ్యి లాక్కుని - వేదికమించి వెళ్ళారు. బుర్రకు పదును పెట్టగా తేలిందేమిటంటే ఆచెయ్యి నన్ను కొట్టడానికికాదు ఆశీర్వదించడానికి ఆయననన్ను తిట్టలేదు దీవించాడు ఆయన నోటివెంట వచ్చినది భాష శుద్ధ గీర్వాణమట ఇంతకీ ఘనాపాఠీ అంటే ఆయన పేరో బిరుదమో. ఉద్యోగమో తెలియనేలేదు నాకు వీళ్ళు సన్మానం చేస్తున్నారే తప్ప నిజానికి నాకేం జ్ఞానముంది?

ఈసారి వేదిక నలంకరించ వచ్చినది ఓ జ్యోతిషమార్తాండుడు వస్తూనే ఓసారి నా ముఖం చూసి ఉపన్యాసం మొదలుపెట్టాడు. అలనాటి పోతనవీ నావీ శరీరలక్షణా లొకటేనట (ఆయన స్వయంగా పోతనను చూడలేదనడానికి నాకే ఆధారమూ లేదు) నేను పోతనంతటి కవి నౌతానట, నా యశోచంద్రికలు పున్నమినాటి వెన్నెలలా సకల పృథివీవ్యాప్తా లౌతాయట నా కవిత్వంలో శ్రీనాథుడంతటి రాజసం ఉంటుందట. ఇలాగే సాగింది ఉపన్యాసం.

ఓవంక పొగడ్తలు ... మరోవంక కాగితపు పూలు ... ఇరుప్రక్కలా గ్రుచ్చుకుంటున్నాయ్ నన్ను. మహా అయితే రచయితను-కవిని కాను. కనుక సిగరెట్ అలవాటై నన్ను చంపుకు తింటోంది. సిగరెట్ కోసం మనసు మధనపడు తోంది. బ్రహ్మానందం యింత బాధకు నన్ను గురి చేశారు కనుక యికపై అతన్ని గౌరవించకూడ దనిపించేసింది.

ఈసారి థాన్స్ మాధ్యమిక పాఠశాలోపాధ్యాయుడిది. అచ్చంగా అచ్చ తెనుగులో ప్రారంభించాడు. అచ్చు తెలుగే తప్ప అచ్చ తెలుగు ఏ మాత్రమూ తెలియదు నాకు. అచ్చ తెలుగన్న పదంలో రెండు అచ్చు తప్పులని ఆశ్చర్యపోయే అమాయక జీవిని. నన్ను కవి వరేణ్యుడన్నాడు. అదన్నాడు. ఇదన్నాడు. నేనేమిటో అది తప్ప మిగిలినవన్నీ అనేశాడు పావుగంటలో. అప్పటి కతను శాంతించాడు.

సిగరెట్‌కోసం ప్రాణం కొట్టుకుంటూంది. వాటివిచూస్తే శ్రోతలందరూ ఉపన్యాసమినడమే ప్రధానోద్దేశంగా పెట్టుకువచ్చినట్టున్నారు. అధమ పక్షం మరో మూడుగంటలీ సిగరెట్ ఇంప్రిజన్ మెంటు తప్పదు.

నా గుండెలు గుభిల్లు మన్నాయ్ కర్తవ్యం తోచ లేదు మూర్ఛవస్తుందేమో అనిపించ సాగింది. మధ్య మధ్య బ్రహ్మానందం పలకరింపులు ముళ్ళ మీద కూర్చోడం అనే ప్రయోగం సార్థకమౌతోంది నా పట్ల. స్వంత ఖర్చుతో సన్మానంచేసి పగ తీర్చుకోవలసినంతటి శత్రువు లెవరున్నారాఅని ఆలోచిస్తూ కూర్చున్నాను పొగడ్తల బోరు భరించలేక, కాని.. ఉపన్యాసాల హోరు నన్ను విడిచిపెడుతుందా! అందులోనూ మైకు! శ్రోతలు వక్తల ఉపన్యాసాలకు పెడచెవి పదిలి తమ ఆలోచనలలో తాము ఉండిపోకుండా - బలవంతంగా ఉపన్యాసం వినేట్టు చేయడానికి మైకు మహా మంచి సాధనమని అర్థమైంది.

అందరూ అయ్యారు. నావంతు వచ్చింది.

ఇప్పటికి నేనొకవిషయం అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాను. ఉపన్యాసాలనేవి యివ్వడానికే తప్ప పుచ్చుకోడానికి (వినటానికి) బాగుండవని అందరికీ తెలుసు. అయినా ఎవరివంతు వచ్చేటప్పటికి వారది మరిచిపోయి ప్రవర్తించారు. అదే పొరపాటు. నేనూ చేయకుండా మీ వీడ్కోలుకి నా కృతజ్ఞతలు, మీ అభిమానానికి నా వందనాలు' అనేసి ఓ దండం పెట్టేసి కూర్చోడంతో చప్పట్లు మెరిశాయి. అంతవరకూ ఉపన్యాస బాధితులైన శ్రోతలకు నా ముక్తసరి మాటలు హర్షోద్రేకాలను కలిగించాయో లేక నువ్వెంతకంటె ఏం మాట్లాడ గలవులే మా పెద్దలముందన్న చులకనభావమో - ఆ ముఖాలనుచూసి నేనే నిర్ధారించుకోలేకపోయాను.

మళ్ళీ బ్రహ్మానందం. మొత్తానికి సభ ముగిసింది.

మేము సన్మానం ఏర్పాటుచేస్తే వీడ్కోలనేశావేం? అంటూ ఎదురుతిరిగా దొక పెద్దమనిషి

క్షమాపణలు చెప్పుకున్నాను.

ఓ దినపత్రిక ఏజంట్ కమ్ విలేకరి, బ్రహ్మానందం నన్ను రూమువరకూ సాగనంపి వెళ్ళారు రాత్రి పదకొండు ప్రాంతంలో.

మేజరాపరేషన్ ముగిశాక స్లీపింగ్‌డోస్ ఇవ్వని పేషంట్‌లా బాధపడ్డాను రాత్రంతా. కన్ను మూత పడితే చాలు. ఎవరో నాకు సన్మానం చేయబోతు న్నట్లు పీడకల రావడం. తుళ్ళిపడి లేవడమూ. ఇంకా అక్కడుంటే మరో బృందం నాపై సన్మాన హింస తలపెడతారేమో అన్న భయంతో తెల్లవారు ఝామునే బస్సెక్కేశాను.

[నిజానికికథ యిక్కడితో అంతమవాలి. కాని చిత్రమేమిటంటే యీ చిన్న కథకు యింతవరకూ ఉపోద్ఘాతమే చెప్పబడింది. అసలీకథ ప్రారంభ మయేది యిక్కడినుంచే].

అనుకోకుండా ఓరోజు శలవు డిక్లేర్ కావడంతో మూడవనాడు కొత్త ఊరిలో కొత్త ఆఫీసులో చేరాను. నేను అడుగు పెడుతూంటే ... 'మొన్న పేపర్లో సన్మానంగురించి చదివామే. ఈయనే... 'నన్ను వింత జంతువుని చూసినట్లు చూస్తూ, గుస గుస లాడుకోసాగారు. ఆఫీసర్ కూడా ప్రత్యేకంగా పిలిపించి — "మీరు కథలూ గట్రా రాస్తారుట! చాలా గొప్పవారని విన్నాను. అఫ్‌కోర్స్ మొన్న పేపర్లోనూ చూశాను. మీరిక్కడికి రావడం చాలా బాగుంది. ఇంత చిన్న వయసులోనే అంత పేరు తెచ్చుకోగలగడం చాలా కష్టం"

నాకు నోరు పెగలలేదు. లోలోపల ఏడు పొస్తూంది. 'నేనేమీ విఐపినికాను, నాలో మీరను కునేంత గొప్పతనమేమీలేదు. మీరందరూ వట్టి అమాయకులు! అంటూ అరవాలన్నంత ఉద్రేకం వచ్చేసింది. ఎలాగో నిగ్రహించుకున్నాను. అంతా అయోమయంగా ఉంది. కేవలం ఎదుటివారి అమా యకత్వంవల్ల నేను గొప్పవాడినౌతున్నాను ఎక్కడో అంటాడు జాన్సన్ 'చాలా గొప్పతనానికి కారణం వారి చుట్టుపక్కలవారి అల్పత్వమని' నా విష యంలో అది నిజం కాబోవడంలేదుకదా!-అని నా భయం.

ఆఫీసయి వెళ్ళిపోబోతుంటే 'బాబూ, యీ వుత్తరాలు తమరివేనా!' అంటూ ప్యూన్‌వచ్చి నాలుగైదు ఉత్తరాలందించాడు, రెండు కవర్లు మినహా మూడు కార్డులే. చదువుతూ నిలబడ్డాను.

నాకు కొంచం దూరంలో కలీగ్స్ గొణు క్కుంటున్నారు. ఓహో! - నాలుగైదు ఉత్తరాలు రావడంకూడా గొప్పతనానికి నిదర్శనంగా పరిగ ణిస్తున్నారేమో అని భయం వేసింది. వాళ్ళమీద విపరీతమైన జాలివేసింది. ఇక అక్కడ ఉండలేక నడుస్తూంటే అసలు విషయం లీలగా వివిపించింది. ఏ మాత్రం ఆలస్యం చెయ్యకుండా త్వరత్వరగా హోటల్ రూమ్ చేరుకుని-షవర్ కింద అరగంట నిలుచుని-అనంతరం ఓ స్ట్రాంగ్ నెస్‌కేఫ్ తీసు కునే వరకూ మనసు స్థిమితపడలేదు. అప్పుడు కవర్లు తెరిచాను మొదటిది బ్రహ్మానందం నుంచి.

"మిత్రులకి...మీరు క్షేమంగా చేరి ఉంటారని తలుస్తున్నాను. సన్మాన సభ గురించి అన్ని పత్రి కలూ వేశాయి. మీరూ చూసే ఉంటారు. నాలుగు ఇంగ్లీషు పేపర్లూ, నాలుగు తెలుగూ - మొత్తం ఎని మిది పేపర్లు వేసాయి. నేను చాలా గర్విస్తు తున్నాను. మీవంటి మిత్రులు వరంలా లభించారు. మా దురదృష్టం కొద్దీ దూరమయ్యారు. అప్పు డప్పుడు యిక్కడికి వస్తూ ఉండండి. మమ్మల్ని మరచిపోకండి" — బ్రహ్మానందం.

నవ్వుకుని రెండో కవరు తెరిచాను.

"నేనెవరో మీకు చెప్పడం అనవసరం. చెప్పా లంటే బ్రహ్మానందం స్నేహితులలో ఒకడిని మీకు కొన్ని నిజాలు వ్రాయడం మంచిదనిపించి వ్రాస్తు న్నాను.

స్నేహానికి రోజులలో రెండు ప్రయోజనా లున్నాయ్. ఎదుటివాడి వల్ల తను బాగుపడటం; రెండవది - ఎదుటివాడి లోపాలను కనిపెడుతూ లోలోపల వాటిని హేళన చేసుకుంటూ ఆనందించ గలగడం. మొదటి ప్రయోజనం ఆశించి బ్రహ్మా నందం మీ స్నేహం చేశాడు. అతని కోరిక నెర వేర్చుకుందుకు ఏడాదిపైగాపట్టింది. వయసుమళ్ళినా ఓ కుర్రసరదా మిగిలిపోయిం దతనిలో. అచ్చులో పేరు చూసుకోవాలనుకునే వ్యసనం అది అందుకే మీ ప్రాపకంతో ఆ వయసులో కథలు రాసే ప్రయత్నం చేశాడు. అవి పడలేదు. మీ కథల మీద ప్రశంసలు పంపినా - కత్తికట్టినట్లు పత్రిక అచ్చువేయలేదు. చివరకి - మీకు సన్మానం చేసి కోరిక తీర్చుకోగలిగాడు. మీ పేరుతోపాటు అతనిది కూడా (అధ్యక్షుడు కనుక) ఎనిమిది పేపర్లలో పడింది. మీరు రచయితలు కనుక-మీకు సన్మానం చేస్తే తనూ అచ్చుకెక్క వచ్చునని-చచ్చిచెడీ నలు గురినీ పోగుచేసి - శ్రమపడినందుకతనికి ఫలం దక్కింది. అచ్చులో పేరుచూసుకున్న బ్రహ్మానందం ముఖాన్ని వర్ణించడానికి నేను రచయితనూ, కవినీ కాను. సన్మానానికయిన పాతికరూపాయల ఖర్చు ఆ ఆనందంముందు ఓ లెక్కలోనిది కాదని అతనే అనేశాడు. బ్రహ్మానందానికి మీ మీద అభి మానం లేదనను. కానీ అందులో నూటికి తొంభై వంతులు స్వార్థమంటాను నమ్మితే నమ్మండి...'

తెల్లబోయి మిగిలాను. ఇంతవరకూ అందర్నీ అమాయకులనుకున్నందుకు విచారించవలసి వస్తూంది. బ్రహ్మానందం నన్ను పాచికగా పెట్టు కుని తను పందెం గెలిచినందుకు నాకేమీ కోపం లేదు. జాలీ వేస్తూంది. అచ్చులోపేరు చూసుకుందు కంతకంటె తక్కువ ఖర్చుతోనే సాధ్యమని- పాపం- అతనికి తెలియదు.

ఆలోచనలో ఉండగానే సాయంత్రం ఆఫీసు వాళ్ళ గూడుపుఠాణీ గుర్తుకొచ్చింది.

నాస్తికుణ్ణల్లా ఆస్తికుడినైపోయి- 'భగవాన్ నేను పాపినికాను. రేపు ఆఫీసులో వాళ్ళు జరుప బోయే స్వాగతసభ (వెల్‌కమ్‌పార్టీ)లో మళ్ళీ నన్ను ఫూల్‌ని చేయకు' అంటూ చేతులు జోడించాను.

★

## నవనాగరిక యువతి

వాళ్ళ అమ్మమ్మ పడకటింట్లో వేసు కునే దుస్తులకంటే తక్కువ దుస్తులతో బజార్లో తిరగగల ధైర్యంకలది.

